# ప్రజా తీర్పునుశి రసావహిస్తాం..


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్

- ఓడినా కార్యకర్తలకు అండగా ఉంటా..
- పాలమూరు అభివృద్ధి కొనసాగించాలి
- ఎమ్మెల్యే యెన్నంకు శుభాకాంక్షలు
- బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తున్నట్లు బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం భూత్పూర్ రోడ్డులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యేగా గెలుపొందిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఎన్నికల్లో తన కోసం కష్టపడి పనిచేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఓడినా కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. వలసల జిల్లా పేరును రూపు మాపేందుకు తీవ్రంగా కృషి చేశానని చెప్పారు. పదేండ్లుగా నియోజకవర్గానికి అనేక పనులు చేశాం. మేం మంజూరు చేసి మిగిలిపోయిన పనులను కొత్త ఎమ్మెల్యే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, బడ్జెట్ హోటళ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎకోపార్క్‌లో బర్డ్స్ ఎన్‌క్లోజర్, 26వేల ఎకరాల్లో జంగిల్ సఫారీ, అమర రాజా పరిశ్రమ, మన్యంకొండ రోప్‌వే, ఐటీ టవర్ కంపెనీల రాక, రింగ్ రోడ్డు, హజ్ హౌస్, క్రిస్టియన్ భవన్, జర్నలిస్టుల ఇండ్లు, మైనారిటీ గురుకుల కాంప్లెక్స్, జేఎన్‌టీయూ క్యాంపస్, కొత్త ఎస్పీ కార్యాలయం, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వంటి అనేక పనులను పూర్తి చేయాల్సి ఉందని గుర్తు చేశారు. అధికారులు కూడా వారికి సహకరించాలని కోరారు. అన్ని కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు ఇచ్చామని వాటిని పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రితో ఉన్న అనుబంధంతో అనేక పనులు చేశామని, మా మీద కోపంతో ఈ అభివృద్ధి పనులను ఆపవద్దన్నారు. విధి నిర్వహణలో ఏమన్నా ఇబ్బంది పెట్టి ఉంటే అన్యదా భావించవద్దని అధికారులకూ విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేకు అవసరమైతే నా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ముఖ్యంగా కొంతమంది అసత్య ప్రచారం చేయడం నన్ను ఎంతో బాధ పెట్టింది. భూములు, ఆస్తులు గుంజుకుంటే ఎవరైనా ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. లేనిపోని ఆరోపణలు చేయడమే తనను తీవ్రంగా బాధిస్తుందన్నారు. ఏది ఏమైనా ప్రజలకు పదేండ్లు సేవ చేసే అవకాశం కలిగించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఓటమికి మేం కుంగిపోం.. ప్రజా సమస్యల పరిష్కారానికి చేసే పోరాటంలో ముందుంటామని ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహమాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్ తదితరులు ఉన్నారు.

# ప్రజల తీర్పునుగౌ రవిస్తాం..

- అచ్చంపేట ప్రజల మధ్యలో ఉండి పనిచేస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు


విలేకరులతో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

అచ్చంపేట, డిసెంబర్ 3 : తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు అచ్చంపేట ప్రజలే శ్వాసగా, ఊపిరిగా ఉన్న తనను ఈస్థాయికి తీసుకువచ్చిన అచ్చంపేట ప్రజల కోసమే జీవిస్తానని అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2009లో ఎంపీగా పోటీ చేసినప్పుడు నాకు రాజకీయంగా ఎదగడానికి పునాదులు వేసి అప్పుడు ఓడిపోయినా ఆ తర్వాత 2014, 2018 ఎన్నికలలో రెండుసార్లు గెలిపించి నన్ను ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపించి నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అచ్చంపేట ప్రజానీకానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తీర్పు ఏ రకంగా ఉన్న దానిని ప్రజాస్వామ్యబద్ధంగా స్వీకరించి ముందుకెళ్తామని అన్నారు. ప్రజాతీర్పే శిరోధార్యంగా, ప్రజలు ఇచ్చేటువంటి తీర్పే కొలమానంగా తీసుకొని ప్రజలతో కలిసి ఉంటామన్నారు. ఈ రోజు వెలువడిన ఫలితాలలో బీఆర్ఎస్ శ్రేణుకు కుంగిపోవాల్సిన అవసరం లేదని, మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రజల మధ్యన ఉండి ప్రజల కోసం పనిచేద్దామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం ఒకవేళ మంచి చేస్తే సహకరిద్దాం, ప్రజలకు విరుద్ధంగా మనోభావాలకు హానీ చేస్తే గత పోరాట అనుభవాలను కూడా పరిగణలోనికి తీసుకొని నూతన ఉత్సాహంతో ప్రజలల్లోకి పోరాటాలతో ముందుకు వెళ్దామన్నారు. అలాగే ఈ రోజు గెలుపొందిన కాంగ్రెస్ పార్టీకి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని పొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నందున వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. అలాగే వారి పాలన ప్రజాస్వామ్యయుతంగా కొనసాగాలని ప్రజలందరికీ మేలు చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా తన కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరికీ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కాంగ్రెస్ ఆగడాలు, దౌర్జన్యాలకు భయపడవద్దని, కార్యకర్తలు, అభిమానులకు అండగా ఉంటానని అన్నారు. ప్రాణత్యాగానికైన సిద్ధపడతానని అన్నారు. నన్ను గెలిపించడం కోసం మీ శ్రమ నాకళ్లలో కదలాడుతుంది. రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లో వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రణాళికలు రూపొందించుకుందామన్నారు. గాలికి వదిలేసేప్రసక్తే లేదన్నారు. వెన్నంటు ఉంటా అందరం కలిసికట్టుగా అచ్చంపేటకు మంచి కోసం పనిచేద్దామన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థి వాహనంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి


బీఆర్ఎస్ అభ్యర్థి కారుపై దాడిని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- కారు అద్దాలు ధ్వంసం
- బీఆర్ఎస్ నాయకుల ధర్నా
- కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్తుండగా ఘటన
- వనపర్తిలో ఉద్రిక్తత

వనపర్తి, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ) : వనపర్తి అసెంబ్లీ కౌంటింగ్ కేంద్రం నుంచి ఇంటికి వెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వాహనంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశాయి. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడిన క్రమంలో తాను ప్రజల తీర్పును శిరసావహిస్తానని విలేకరుల సమావేశంలో సింగిరెడ్డి చెప్పారు. అనంతరం కారులో ఇంటికి వెళ్తున్న క్రమంలో గేటు బయట కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్న తలంపుతో కాంగ్రెస్‌కు చెందిన మూకలు దాడికి పాల్పడ్డాయి. చేతులతోనే అద్దాలను గుద్దడం.. కర్రలతో దాడికి పాల్పడగా కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఊహించని ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. అల్లరి మూకలను అదుపు చేసి సింగిరెడ్డి వాహనాన్ని అక్కడి నుంచి పంపించారు. అయితే సింగిరెడ్డి కారుపై దాడి సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో దాడులకు పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయాలని ధర్నాకు ఉపక్రమించారు. అయితే ప్రశాంతంగా ఉండే వనపర్తిలో లేని సంస్కృతికి కాంగ్రెస్ తెరలేపిందని, ఎప్పుడు వనపర్తిలో ఇలాంటి వాతావరణం లేదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఇలాగే కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడితే తాము చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కాంగ్రెస్ సంస్కృతి దాడుల సంస్కృతి అయితే తాము ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. ధర్నా సందర్భంగా వనపర్తిలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎన్నికల ఫలితాల సం దర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ మూక లు ఏకంగా సింగిరెడ్డి వాహనంపైనే దాడి చేయడం పట్టణంలో చర్చనీయాంశమైంది. అయితే పోలీసులు ధర్నాను ఉపసంహరించాలని ప్రయత్నించినప్పటికీ నాయకులు అంగీకరించలేదు. చివరకు డీఎస్పీ ఆనందరెడ్డి దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను ఉపసంహరించారు. మూడు గంటలపాటు కొనసాగిన ఆందోళనతో పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆందోళన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ చైర్మన్ పలుస రమేశ్ గౌడ్, నాయకులు పాకనాటి కృష్ణ, మహేశ్, నాగన్నయాదవ్, అనురాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.


రిటర్నింగ్ అధికారుల నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# గద్వాల ఎమ్మెల్యేగా రెండోసారి బండ్ల

గద్వాల, డిసెంబర్ 3: గద్వాల ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైనా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఆదివారం ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో గద్వాల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వచౌహాన్, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు వసంత్‌కుమార్ ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్‌కుమార్, పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, న్యాయవాది మనోహర్, నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


విజయోత్సవ సంబురాల్లో ఎమ్మెల్యే బండ్లను రంగులతో ముంచెత్తిన బీఆర్ఎస్ శ్రేణులు


రిటర్నింగ్ అధికారుల నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న విజయుడు

# అలంపూర్ విజేత విజయుడే..

అలంపూర్, డిసెంబర్ 3 : అలంపూర్ ఎమ్మెల్యేగా విజయుడు ఎన్నికైనట్టు కౌంటింగ్ అబ్జర్వర్ అనురాధ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గోన్‌పాడు పాలిటెక్నిక్ కాలేజీలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. అలంపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు సమీప కాంగ్రెస్ అబ్యర్థి సంపత్‌కుమార్ పై 30,573 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. ఓట్ల లెక్కింపు అనంతరం అలంపూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి, గద్వాల ఆర్డీవో చంద్రకళ విజయుడుకు ధ్రువీకరణపత్రాం అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, డీఏవో మదన్‌మోహన్‌గౌడ్, ఎన్నికల డీటీ వేణుగోపాల్‌రెడ్డి, తాసీల్దార్ మంజుల, డీటీలు ధరణేశ్, నందిని పాల్గొన్నారు.


గద్వాలలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు